క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలి



విద్యార్థులతో ప్రిన్సిపల్, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: చిన్నతనం నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని ప్రిన్సిపల్ మునేష్ మీనా సూచించారు. కడప శివారులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్నారులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ విద్యా సంవత్సరానికి గానూ విద్యాలయం బాయ్స్ లీడర్‌గా జవ్వంత్‌సాయిరెడ్డి, స్పోర్ట్స్ లీడర్‌గా రేవంత్‌రెడ్డి, గర్ల్స్ లీడర్‌గా సమేనా జయేబా, స్పోర్ట్స్ కెప్టెన్‌గా తేజస్విని ఎంపికయ్యారు. పాఠశాల కార్యకలాపాలలో వారు కీలకపాత్ర పోషిస్తారన్నారు.

సూపరింటెండెంట్‌కు వీడ్కోలు



ఇందిరమ్మ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) లో గ్రేడ్2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జి. ఇందిరమ్మ ఆగస్టు నెలాఖరున పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ దంపతులను శనివారం కడప రిమ్స్ ఐపీ విభాగంలో లెక్చర్ గ్యాలరీలో సన్మానించారు. ఇందిరమ్మ గత 40 సంవత్సరాలుగా సమర్థవంతంగా విధులు నిర్వహించారని, పదవీ విరమణ తరువాత విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హెడ్ సిస్టర్ పాల్గొన్నారు.

మహిళలకు అండ శక్తి యాప్



మాట్లాడుతున్న ఎస్ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: శక్తి యాప్ మహిళలకు కొండంత అండ అని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ అన్నారు. కడప సాయిబాబా హైస్కూల్‌లో శక్తి యాప్ వినియోగంపై విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు సమస్య ఉంటే తక్షణమే అందించే పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళ, బాలికలు తమ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు, ఫోన్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నెంబర్‌కు ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఆజాద్‌నగర్‌లోని బృంద వృద్ధాశ్రమంలో శనివారం దాతలు అన్నదానం చేశారు. దివంగత మల్లేశ్వరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పవన్ కుమార్, జగదీష్‌కుమార్, బాలసుబ్బయ్య, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోండి

కమలాపురం: పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబాఫకృద్దీన్ తెలిపారు. శనివారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్ రావుతో కలిసి విజిట్ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. ఏ కేసులో జైలుకు వచ్చారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యంపై సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100కు ఫోన్ చేయాలని, లేని పక్షంలో కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ను సంప్రదించాలన్నారు.

నగరంలో కొనసాగిన గణేశ్ ఉత్సవాలు

దర్శించుకున్న మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శనివారం 25వ డివిజన్ శంకరాపురంలో వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి శంకరాపురం సింధు ఆహ్వానం మేరకు వారు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి రమణ, పుల్లయ్య, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

● కడప చిన్నచౌక్ ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ.అంజద్‌బాషా ప్రారంభించారు. రాజా, కంట మహేష్, పుల్లారెడ్డి, మధు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని 25వ డివిజన్‌లో వినాయక విగ్రహం వద్ద కేఎస్ఆర్ఎం మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి శనివారం అన్నదానం చేశారు. సూర్యనారాయణరావు, అఖిలేష్, నాగరాజు, జగదీష్, మల్లికార్జున, తేజపాల్గొన్నారు



చిన్నచౌక్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా




కో ఆపరేటివ్ కాలనీలో



అన్నదానం చేస్తున్న దాతలు



ప్రత్యేక అలంకరణలో వినాయకుడు



బెల్లంమండివీధిలో

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం అని ఈగల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. కడప శంకరాపురం లోని గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువతకు భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తిస్తూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కట్టడికి ఏర్పాటుచేసిన 'ఈగల్' టాస్క్ ఫోర్స్ అధికారులు ప్రత్యేక కృషి చేస్తున్నారని చెబుతూ ఎన్‌డీపీఎస్ చట్టంలోని కఠిన శిక్షలు గురించి స్పష్టంగా వివరించారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మల్లయ్య, అయూబ్‌ఖాన్, గురుశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు

రిషికొండపై పవన్ కళ్యాణ్ దుష్ప్రచారం



లోగిడి జయన్న

కడప కార్పొరేషన్: విశాఖపట్నంలోని రిషికొండపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించిన భవనాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ లోగిడి జయన్న ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. చిన్నపాటి ఫాల్ సీలింగ్ కింద పడిందని డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ దగ్గరుండి ఫోటోలు తీయించడం దారుణం అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబుతో కలిసి పవన్‌కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు హామీలిచ్చారని, వాటిని అమలు చేయలేక ఈ జిమ్మిక్కులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సుగాలి ప్రీతి కేసును సీబీఐకి ఇస్తామని చెప్పి.. ఇపుడు ఆ కేసు గురించే పట్టించుకోవడం లేదన్నారు. వలంటీర్ల వల్ల 33 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పిన పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వం వచ్చాక వారిలో ఎంతమందిని వెదికి కుటుంబాలకు అప్పగించారని ప్రశ్నించారు. వలంటీర్లకు రూ.5వేలు ఏమాత్రం సరిపోదు...తాము అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చి వారి ఉద్యోగాలే లేకుండా చేశారన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయడం చేతగాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కరోనా వల్ల రెండేళ్లు ప్రపంచమంతా ఇబ్బందులు పడినా మన రాష్ట్రంలో నవరత్న హామీలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

బార్ కౌన్సిల్ మోడల్ టెస్ట్‌కు స్పందన



ఏఐబీఈ పరీక్ష రాస్తున్న న్యాయవాదులు

కడప అర్బన్: ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామినేషన్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన లభించినట్లు భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ అన్నారు. కడప బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం ఉదయం ఏఐబీఈ పరీక్ష జరిగిందని, ఇందులో 25 మంది యువ న్యాయవాదులు పాల్గొన్నారని తెలిపారు. ప్రతి సందర్భంలోనూ జూనియర్ సివిల్ జడ్జ్ మోడల్ టెస్టు నిర్వహిస్తూ న్యాయవాదులకు ఉపయోగపడే పనులు ఎన్నో ఐఏఎల్ చేసిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేయడమేగాక రాజ్యాంగ పరిరక్షణ కోసం నిత్యం కృషి చేస్తూ న్యాయవాదుల్లో చైతన్యం కలిగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రవదన, నాగార్జున, సూర్యనారాయణరెడ్డి, గురప్ప, మునికుమార్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ మార్గ్‌లో వైన్‌షాపు ఏర్పాటు చేయవద్దు



మాట్లాడుతున్న శ్రీరంజన్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాజీవ్ మార్గ్‌లో వైన్ షాపు ఏర్పాటు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ రాజీవ్ మార్గ్‌లో ఉదయం, సాయంత్ర వేళల్లో మహిళలు, సీనియర్ సిటిజన్స్ వాకింగ్ చేస్తూ ఉంటారని తెలిపారు. సమీపంలోనే నాగార్జున, చైతన్య, శివశివానీ విద్యా సంస్థలు ఉన్నాయన్నారు. వైన్ షాపు ఏర్పాటు చేస్తున్న బిల్డింగుల ప్రక్కనే రెడ్డిసేవాసమితి, లేడీస్ హాస్టల్స్ ఉన్నాయన్నారు. వేలాది విద్యార్థులు, మహిళలు సంచరించే చోట వైన్‌షాపు ఏర్పాటు చేయాలనుకోవడం సరైంది కాదన్నారు. వైన్‌షాపు ఏర్పాటుకు ముందున్న డ్రైనేజీని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోక పోతే మహిళలు, విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లకు డిగ్రీ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని అధ్యాపకులు గోవిందరెడ్డి, శ్రీనివాసులు, విజయ్‌కోల్, భాగ్యలక్ష్మమ్మ, సంపూర్ణ, స్వరూప కోరారు. జెడ్పీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని శనివారం వారు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్న అధ్యాపకులు డిగ్రీ లెక్చరర్ల పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. 2012 నుంచి నేటి వరకు ప్రభుత్వం నాలుగుసార్లు ఏపీపీఎస్‌సీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు జారీచేసి 25 శాతం కోటా భర్తీ చేసిందన్నారు. గత 12 సంవత్సరాలుగా ఒక్క జేఎల్ పదోన్నతిని కూడా మంజూరు చేయలేదని అన్నారు. ఇటీవల 590 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకు సీనియారిటీ జాబితాను వివిధ విషయాల్లో తయారుచేసిందన్నారు. వీరంతా 55శాతం పీజీ అర్హతతోపాటు యూజీసీ–నెట్, ఏపీ సెట్, జేఆర్ఎఫ్, పిహెచ్‌డి సర్టిఫికెట్లు అర్హత కలిగి ఉన్నవారేనన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ల నియామకం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ సురేష్ బాబు



మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిపై నైట్ వాచ్‌మెన్ల నియామకానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన శనివారం సాయంత్రం ఆయన ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో 11 పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించేందుకు అంగీకారం తెలిపారు. అలాగే మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 55 మంది పార్ట్‌టైం స్వీపర్లను యథావిధిగా కొనసాగించాలని, జూలై 2023 నుంచి రూ.6వేల చొప్పున వేతనం చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. పాతబస్టాండులోని 15 షాపుల బాడుగ పెంచి మరో మూడేళ్ల రెన్యువల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని 23 షాపుల లీజు కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో రెన్యువల్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్, కొబ్బరి నూనెకు అయ్యే ఖర్చును జనరల్ ఫండ్ నుంచి భరించాలని తీర్మానించారు. నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రం నిర్వహణ బాధ్యతలు నిర్వహించేందుకు ముగ్గురు ఉద్యోగుల సేవలను ఏడాది పొడిగించాలని తీర్మానించారు. దేవుని కడపలో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణను టీటీడీ వారికి అప్పగించాలని నిర్ణయించారు. నగరంలో ఆరు ప్రదేశాలలో మోడరన్ బస్ షెల్టర్ల నిర్మాణానికి టెండర్ పద్ధతి యాడ్ ఏజెన్సీకి అనుమతి ఇవ్వాలని తీర్మానించారు. ఇంటింటి చెత్త సేకరణ చేయుటకు 8 ట్రాక్టర్లు కొత్తగా కొనుగోలు చేయాలని, నాలుగు నిరాశ్రయుల వసతి గృహాలలోని వారికి భోజన ఖర్చుల నిమిత్తం రూ.32.40 లక్షలు చెల్లించడానికి కౌన్సిల్ సభ్యులు తమ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మగ్బూల్‌బాషా, బాలస్వామిరెడ్డి, కె. బాబు, అరీఫుల్లాబాషా, ఎస్.వాణి, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఓ కన్నయ్య పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చుతో దేశం విచ్ఛిన్నం



మాట్లాడుతున్న అశోక్ రెడ్డి

కడప రూరల్: పాలకులు కులాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని వక్తలు అన్నారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం ఆధునిక ధర్మశాస్త్రం భారత రాజ్యాంగం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు, కర్నూలు జిల్లాలకు చెందిన ఆవేదిక నేతలు గోరంట్ల సుదర్శన్, రామకష్టారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశ్రీ తన పాటల ద్వారా అసలైన ప్రజాస్వామ్యాన్ని ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధునిక ధర్మశాస్త్రమని తెలిపారు. డాక్టర్ అశోక్‌కుమార్, సీఆర్వీ. ప్రసాద్ మాట్లాడుతూ పాత తరం నాయకుల స్ఫూర్తిని నేటి యువత ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సగిలి గురప్ప, ఓబయ్య, రాము, వెంకటశివ, మనోహర్ రెడ్డి, సంగటి మనోహర్, జేవి రమణ తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలను బహూకరిస్తున్న ఆముక్తమాల్యద

కడప ఎడ్యుకేషన్: ప్రముఖ సాహితీవేత్త డా.తిరుమల రామచంద్ర కుమార్తె శ్రీమతి ఆముక్తమాల్యద విలువైన పుస్తకాలను శనివారం సిపి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ చెన్నైలో తన నివాసంలో ఆమె బహూకరించిన విలువైన గ్రంథాల్లో ప్రత్యేకించి తిరుమల రామచంద్ర రచనలు ఉండడం విశేషమన్నారు. బృహదారణ్యకం, మనవి మాటలు, అహంభో అభివాదయే, తిరుమల రామచంద్ర జీవితం, సాహిత్యం, ప్రాకృత వాఙ్మయంలో రామకథ లాంటి పుస్తకాలున్నాయన్నారు. వాటితోపాటు స్వయంభూ, ఇసుక రేణువులు, ఇదిగో లోకానికి ఇది నా లేఖ, శాసనాలు సామాజిక, సాంస్కృతిక, చరిత్ర, పార్వతీ పరిణయం, శ్రీరమణ పుస్తకాలతోపాటు ఆంగ్ల నవలలు, కథలు ఉన్నాయన్నారు. అనంతరం ఆముక్తమాల్యదను వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మలు అభినందించారు. కార్యక్రమంలో డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, ఎస్.రమేశ్‌రావు, ఆర్.వెంకటరమణ, మౌనిక పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు రైతులకు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డి.సి.టి.ఓ గీతావాణి, వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. శనివారం వెల్లటూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. దుకాణాదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించి తప్పని సరిగా రసీదు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించినట్లు రుజువైతై వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు రసాయనిక ఎరువులు అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. రైతులకు యూరియా అందుబాటుతో ఉందన్నారు. ఏఓ కృష్ణ సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతమైన అమృత సముద్రం భగవద్గీత



మాట్లాడుతున్న తురియానంద సరస్వతి

కడప ఎడ్యుకేషన్: భగవద్గీత అన్ని జ్ఞానాలకు మూలమని అనంతమైన అమృత సముద్రమని కడప చిన్మయ మిషన్ అధ్యక్షుడు స్వామి తురియానందసరస్వతి అన్నారు. పాత కడపలో దశమహావిద్వాన్ నాగేంద్ర మహోధరస్వామి ఆశీస్సులతో శనివారం సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ ప్రారంభించారు. తురియానంద సరస్వతి మాట్లాడుతూ గీతను అనుసరించిన మానవుడు ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకుంటాడని తెలిపారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రామాయణ, భారత, భాగవతాలు నేటి సమాజానికి ఎంత ఉపయోగకరంగా ఉంటాయో స్పష్టపరిచారు. మామిళ్ల వెంకటరమణయ్య గారి లోకనాథం ప్రసంగిస్తూ యువత ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటే రామాయణం కంటే మించిన నీతిశాస్త్రం మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి శంకర్, కాల్వ సోమ కళానాథరెడ్డి, కొవ్వూరు రామసుబ్బారెడ్డి, దేసువెంకటరెడ్డి, నందారపు చెన్న కష్టారెడ్డి, చెన్నంశెట్టి శశికుమార్, బండ్రెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి, కల్లూరు విజయానందరెడ్డి, డాక్టర్ కష్ణప్రసాద్, యడవల్లి భాస్కర్ వర్మ, పటుటూరు సూర్యనారాయణ, కెఆర్‌కె.ఉమామహేశ్వరబాబు, సింగనమల వెంకటరమణారెడ్డి, డాక్టర్ జి.గురుప్రసాద్, రంగిశెట్టి కీర్తికుమార్, బ్రహ్మపురి సురేష్‌కుమార్, జెకె.కష్ణసింగ్, బి.జనార్ధన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతకు బహుమతి ప్రదానం



విజేతకు బహుమతి అందజేస్తున్న షోరూం ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జోస్ అలుక్కాస్ సంస్థలో అమలుచేస్తున్న చైన్ ఫెస్ట్ ఆఫర్‌లో లక్కీ డిప్‌లో విజేత రెడ్డిగవాస్కర్‌రెడ్డికి ఫ్రిడ్జ్‌ను అందజేసినట్లు మేనేజర్ గణేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివాహ సీజన్‌ను పురస్కరించుకుని బంగారు ఆభరణాల విక్రయ సంస్థ సెప్టెంబరు 13 నుంచి 19వ తేది వరకు షోరూం మొదటి వార్షికోత్సవాన్ని వేడుకగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రూ.7500 విలువజేసే బంగారు ఆభరణాలు కొనుగోలుపై బంగారు నాణెన్ని ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వజ్రాలపై 20 శాతం తగ్గింపుతో పాటు ప్రతి క్యారెట్‌కు 500 మిల్లీ గ్రాముల బంగారు నాణెన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్లాటినంపై 15 శాతం తగ్గింపు, తరుగు ఛార్జీలు, వెండి ఆభరణాలపై జీరో శాతం తరుగు ఛార్జీలు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం అసిస్టెంట్ మేనేజర్ సినోజ్, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.